

దూద్‌బౌలిలోని పూర్వీకుల నివాసంలో చేపప్రసాదం వేస్తున్న బత్తిని సోదరుడు శంకర్ గౌడ్



హైదరాబాద్ వార్త

# వర్ష బీభత్సం..!



-ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షం
-కరెంటు వైర్లు తెగి ఇద్దరు యువకులు మృతి
-గంటలోనే 9 సెం. మీ రికార్డు వర్షపాతం
-నేలకూలిన భారీ వృక్షాలు.. నిలిచిపోయిన వాహనాలు
-నలుదిక్కులా కిలో మీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్

**హైదరాబాద్,జూన్ 9, ప్రభాతవార్త**

తొలకరి వర్షం దంచికొట్టింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో నగరంలో భారీ వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షం విషాదాన్ని నింపింది. నగర వ్యాప్తంగా కుండపోతగా వాన పడటంతో పలు ప్రాంతాలు జలమయమవగా, పాతబస్తీలో జరిగిన ఘోర ప్రమాదంలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈదురుగాలుల భారీ వర్షానికి విద్యుత్ తీగలు తెగిపడి ఇద్దరు యువకులు చనిపోయారు. భారీ వర్షం బీభత్సంతో లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధమయ్యాయి. రోడ్లన్నీ నదులను తలపించాయి. పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి.విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి నలుదిక్కులా కిలో మీటర్ల కొద్దీ ట్రాఫిక్ స్తంభించింది. ఉద్యోగులు, వాహనదారులు నరక యాతన పడ్డారు. ముందుకు సాగేందుకు గంటల కొద్దీ సమయం పట్టింది. పలు ప్రాంతాల్లో మెట్రో స్టేషన్లు, ఫ్లైఓవర్ల కింద భారీ ఎత్తున వర్షపు నీరు నిలిచింది. రోడ్లపై భారీ వరద నీరు చేరడంతో వాహనాలు నీటమునిగాయి. ఓపెన్ నాలాలు, మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లాయి. ద్విచక్రవాహనదారులు, పాదచారులు వర్షం నుండి తప్పించుకోవడానికి ఫ్లైఓవర్లు, దుకాణాల షెడ్ల కింద తలదాచుకోవాల్సి వచ్చింది. ప్రధాన రోడ్లన్నీ నదులను తలపించాయి.రహదారులపై మోకాళ్ల లోతు నీరు చేరడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది.



**రోడ్లన్నీ జలమయం..**

పలు ప్రాంతాల్లో మోకాళ్లలోతు నీరు ఆగడంతో వాహనాలు నీటమునిగాయి.అమీర్‌పేట్‌లోని హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయం స్వర్ణజయంతి కాంప్లెక్స్ చుట్టూ పెద్ద ఎత్తున, వరదనీరు వచ్చి చేరింది. కాంప్లెక్స్‌లోని సెల్లార్లోకి సైతం వరదనీరు వచ్చి చేరింది. హైదరాబాద్ సెంట్రల్, మేడ్చల్ సర్కిల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో సమస్యలు ఏర్పడ్డాయి. రోడ్లన్నీ జలమయమం కావడంతో ట్రాఫిక్ అతలాకుతలమైంది. ఖైరతాబాద్ నుంచి బేగంపేట్, మెహిదీపట్నం నుంచి గచ్చిబౌలి, గచ్చిబౌలి నుంచి కొండాపూర్, పంజాగుట్ట నుంచి గచ్చిబౌలి, కూకట్‌పల్లి నుంచి మియాపూర్, శేరిలింగంపల్లి నుంచి హైటెక్ సిటీ, మాదాపూర్, హయత్‌నగర్ నుంచి మలక్‌పేట, బషీర్‌బాగ్ నుంచి కోఠి, ట్యాంక్‌బండ్ ఎన్టీఆర్ రోడ్, ఆర్పీరోడ్ వరకు భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, టోలిచౌకి, ఫిలింనగర్ ఏరియాల్లో ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. మెహదీపట్నం రోడ్డులో కూడా భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి, తార్నాక- హబ్సిగూడ-నాచారం రోడ్డులోనూ ఇదే పరిస్థితి కనిపించింది. జూబ్లీహిల్స్ అపోలో రోడ్డులో ట్రాఫిక్ జామ్ కారణంగా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో వాహనదారులు నానా తిప్పలు పడ్డారు.

**ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు...**

కుండపోతగా కురిసిన వర్షానికి నిమ్స్ ఆస్పత్రి అతలాకుతలమైంది. ఆస్పత్రి ప్రాంగణంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. మిలీనియం బ్లాక్ వద్ద రహదారి వర్షం నీటితో చెరువును తలపించింది. బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని నిమ్స్ గేట్ సమీపంలో ఎడతెరిపిలేని వర్షానికి భారీ వృక్షం కూలింది. ఆ సమయంలో రోడ్డుపై వెళ్తున్న నీళ్ల ట్యాంకర్, ఓ కారుపై ఒరిగిపోయింది. ఈ ప్రమాదంలో చెట్టు వద్ద నిలిపిన ద్విచక్రవాహనం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనతో మాసబ్‌ట్యాంక్ వైపు సుమారు నాలుగు గంటలపాటు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. లక్డీకాపూల్ చౌరస్తా రోడ్లన్నీ జలాశయాన్ని తలపించడంతో వాహనదారులు సతమతమయ్యారు. ఫలితంగా కూడలిలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, గచ్చిబౌలి, లింగంపల్లి, హైటెక్‌సిటీలో భారీ వర్షం కురుస్తోంది.బొల్లారం, ప్యాట్నీ, ప్యారడైజ్, మారేడుపల్లి, చిలకలగూడ, జేబీఎస్, బేగంపేట్ ప్రాంతాలలో భారీ వర్షం పడుతోంది. ఈ భారీ వర్షాల కారణంగా హైదర్‌గూడలో ఓ భారీ వృక్షం నెలకొరిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రామ్‌నగర్ వీఎస్టీ రోడ్డులో మరో చెట్టు నేలకొరిగింది. ముషీరాబాద్‌లో ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.



ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం ముందు రోడ్డుపై నేలకొరిగిన భారీ వృక్షం



రాజేంద్రనగర్‌లో కురిసిన వర్షానికి రోడ్లపై నీరు నిలవడంతో ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న ట్రాఫిక్ సిఐ రాజు,సిబ్బంది

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

-సమయపాలనలో డాక్టర్లు, సిబ్బంది అలసత్వం చేయొద్దు

-జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న నూతన డిఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్

**హైదరాబాద్,జూన్ 9,ప్రభాతవార్త:**

జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని వైద్యులు, సిబ్బంది సమయపాలనలో అలసత్వం చేయకుండా పనిచేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మంగళవారం డిఎంహెచ్‌వో కార్యాలయంలోని సమావేశమందిరం లోప్రోగ్రామ్ ఆఫీసర్స్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్, కార్యాలయ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కార్యాలయంలో ఫైల్స్ క్లియరెన్స్ సకాలంలో పూర్తి చేయాలని పెండింగ్ ఉంచకూడదని సూచించారు. అలాగే జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాలు ,పథకాలు ,ఆరోగ్య సేవలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ప్రోగ్రామ్ ఆఫీసర్స్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్‌ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా, శ్రీధర్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు: దర్శకుడు శేఖర్ కమ్ముల



ఓటరు జాబితాలో పేరును పరిశీలించుకుంటున్న దర్శకుడు శేఖర్ కమ్ముల, గుర్రం పవన్‌కుమార్ గౌడ్‌లు

**సికింద్రాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:**

ఓటు రాజ్యాంగం మనకు కల్పించిన హక్కని ఆ హక్కును ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా వినియోగించుకోవాలని. ప్రముఖ చిత్ర దర్శకులు శేఖర్ కమ్ముల అన్నారు. మంగళవారం పద్మారావు నగర్ లోని ఆయన నివాసంలో ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా మ్యాపింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమం గురించి. సనత్ నగర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఈఆర్ఓ) వివరించారు. ఈ సందర్భంగా దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, దేశ భవిష్యత్తును నిర్ణయించే నిర్ణయాధికారం ఓటు హక్కుకు ఉంటుందన్నారు. సరైన వ్యక్తులకు అధికారాన్ని ఇవ్వడంలోనే భవిష్యత్తు నిర్ణయం జరుగుతుందన్నారు. కాబట్టి ఓటు వేయడంలో నిర్లక్ష్యం తగదన్నారు. సెలవు దొరికిందని విహారాలకు కాకుండా పోలింగ్ బూత్‌కు వెళ్లాలన్నారు. ప్రతి ఒక్క ఓటరు ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొనాలని, జాబితాలో తమ పేరు ఉండేలా పరిశీలన చెలుకోవడం తప్పని సరి అన్నారు. కార్యక్రమంలో పద్మారావు నగర్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, బీఎల్ఓ ప్రదీప్ తదితరులు ఉన్నారు.

## తుకారాంగేట్‌లో సెల్‌టవర్‌ను తొలగించాలని ఆందోళన

**అడ్డగుట్ట,జూన్ 9 ప్రభాతవార్త:**



అడ్డగుట్ట తుకారాంగేట్ గడ్డమీది బస్తీలో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్‌ను తొలగించాలని కోరుతూ స్థానిక మహిళలు సెల్‌టవర్ వద్ద ఆందోళన చేశారు. సెల్‌టవర్‌ను తొలగించే వం`కు తాము ఇక్కడి నుంచి కదిలేది లేదని కొందరు మహిళలు సెల్‌టవర్ ఎక్కి ఆందోళన చేశారు.దీంతో లాలాగూడ పోలీసులు రంగ ప్రవేశం చేసి శాంతింపజేశారు.

## ప్రాచీన కళాప్రదర్శనలతో హోరెత్తిన తెలంగాణ ప్రజాకళ



చెక్కబొమ్మలాట ప్రదర్శనలో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, జూన్ 9 ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి పర్యవేక్షణలో రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల కళామందిరం) ఆరుబయలు కళావేదికలో తెలంగాణ ప్రజాకళ శీర్షికన 99 రోజులపాటు నిర్విరామంగా జరుపుతున్న సాంస్కృతిక మహోత్సవంలో 69వ రోజు రాత్రి ప్రాచీన కళా ప్రదర్శనలతో హోరెత్తి ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. ప్రధానంగా మోతె శంకర్ బృందం ప్రదర్శించిన సంప్రదాయ చెక్కబొమ్మలాట నయనమనోహరంగా అంతరించిపోతున్న ప్రాచీన జానపద కళలను, ఆయా కళాకారులను ఎంతగానో కాపాడుతున్న తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ లక్ష్యానికి ఒక మచ్చుతునకగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి చెక్క బొమ్మలాడించిన కళాకారులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు. కార్యక్రమానికి శ్రీనివాస్‌రాజు, విద్యానందచారిలు వ్యాఖ్యానం ఎంతగానో ఆకట్టుకుంది.

## చోరీలకు పాల్పడుతున్న యువకుడు అరెస్టు

-బంగారు,వెండి వస్తువులు స్వాధీనం

**అత్తాపూర్ జూన్ 9, ప్రభాతవార్త :**



చోరీలకు పాల్పడుతున్న ఓ యువకుడిని అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేసి కేసును ఛేదించారు. మంగళవారం అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో సిఐ నాగేశ్వర్ రావు వివరాలు వెల్లడించారు. అత్తాపూర్ పరిధిలోని తేజస్వి నగర్‌లో గత నెల 28న జరిగిన ఇంటి దొంగతనం కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడు రిషబ్ శుక్లా (21)ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో అతడు ఈ కేసుతో పాటు హైదర్‌గూడ మరియు పరిసర ప్రాంతాల్లో నమోదైన మరికొన్ని దొంగతనం, దొంగతన యత్నాల కేసుల్లో కూడా ప్రమే యం ఉన్నట్లు అంగీకరించినట్లు తెలిపారు.నిందితుడి వద్ద నుంచి బంగారు గొలుసు, రెండు బంగారు కంకణాలు,లాకెట్,రాతి ఉంగరం, ఇతర బంగారు ఆభరణాలతో పాటు వెండి బిస్కెట్లు, వెండి గ్లాసు, పళ్లాలు, గిన్నెలు ఇతర విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నేరాల నిర్వహణ కోసం నిందితుడు అద్దెకు తీసుకున్న కారును కూడా సీజ్ చేశారు.దర్యాప్తులో నిందితుడు హైదర్‌గూడలోని న్యూ ఫ్రెండ్స్ కాలనీ, నందనవనం అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో నమోదైన కేసుల్లో కూడా పాల్గొన్నట్లు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## క్రిస్టల్ టౌన్‌షిప్‌లోని ఇంటిపై పోలీసుల మెరుపుదాడి

- డాక్టర్ సహా ఏడుగురి అరెస్టు

- గంజాయి సేవించిన ఇద్దరి రిమాండ్

**చాంద్రాయణగుట్ట, జూన్ 9, ప్రభాతవార్త :** పాతబస్తీ బండ్లగూడ పోలీసుస్టేషన్ పరిధిలోని ఒక ఇంటిపై పోలీసులు మెరుపుదాడి చేశారు. గంజాయి సేవిస్తున్న ఒక వైద్యుడితో సహా ఏడుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షలలో ఇద్దరికి పాజిటివ్ రావటంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మిగిలిన ఐదుగురిని వదిలేశారు. ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం...విశ్వసనీయ సమాచారం మేరకు రాజేంద్రనగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్ బృందం బండ్లగూడ క్రిస్టల్ టౌన్‌షిప్‌లోని ఒక నివాసంపై మెరుపు దాడి చేశారు. గంజాయి వినియోగిస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. అందులో ఒక వైద్యుడున్నాడు. వారి వద్ద నుండి 220 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో ఊటీ, కొడైకెనాల్ ప్రాంతాల నుండి గంజాయి తీసుకొని వచ్చి పార్టీలు చేసుకున్నట్లు వెల్లడైయ్యింది. పోలీసులు ఏడుగిరికి వైద్య పరీక్షలు జరిపించగా కేరళకు చెందిన బౌన్సర్ సిద్ధార్థ్ సతీష్ (22), మాసాబ్‌ట్యాంక్‌కు చెందిన కౌన్సిలింగ్ నిర్వహించే ఇస్మాయిల్ (22)లు గంజాయి సేవించినట్లు నిర్ధారనైయ్యింది. దీంతో పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మిగిలిన వారికి నెగెటీవ్ రావటంతో వదిలేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

## నగరంలో భారీ వర్షం..క్షేత్రస్థాయిలో డీఆర్ఎఫ్ సేవలు

**పలు ప్రాంతాల్లో పర్యటించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్**

**హైదరాబాద్, జూన్ 9,ప్రభాతవార్త:**

నగరంలో భారీ వర్షం.. బేగంపేట, ఖైరతాబాద్ ప్రాంతాల్లో దాదాపు 9 సెంటీమీటర్ల వర్షం పడింది. ట్యాంక్‌బండ్‌తో పాటు.. సచివాలయం ముందు రహదారులపై మోకాల లోతు నిలబడిపోవడంతో ఆ నీటిని తొలగించేందుకు హైడ్రా డీఆర్ ఎఫ్ సిబ్బంది కృషి చేయగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌క్షేత్రస్థాయిలో పర్యటించి.. హైడ్రా సేవలను పర్యవేక్షించారు. ట్యాంక్‌బండ్ మీద సికింద్రాబాద్ వైపు వర్షపు నీరు నిలిచిపోవడమే కాకుండా.. చెట్టు పడిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో చెట్టును తొలగించే పనులతో పాటు.. వరద సాఫీగా సాగేలా హైడ్రా డీఆర్ ఎఫ్ సిబ్బంది నిమగ్నమయ్యారు. శేరిలింగంపల్లి, కొండాపూర్, గచ్చిబౌలి, షేక్‌పేట, టోలిచౌకి, మాధాపూర్ ప్రాంతాలతో పాటు.. సికింద్రాబాద్, హైదర్‌గూడ ప్రాంతాల్లో హైడ్రా డీఆర్ ఎఫ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో సేవలందించారు. దాదాపు 76 చోట్ల చెట్లు పడిపోవడంతో వాటిని హైడ్రా సిబ్బంది తొలగించారు.

**బతుకమ్మకుంటకు భారీగా వరదనీరు**

అంబర్‌పేటలోని బతుకమ్మకుంటకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రవాహంలా వస్తున్న వరద గతంలో పరిసర బస్తీలను, కాలనీలు ముంచెత్తేది. బతుకమ్మకుంటకు వరద నీరు చేరేలా హైడ్రా ఏర్పాట్లు చేయడంతో ఇప్పుడు ఆ ముప్పు తప్పింది. ఎండాకాలంలో నీరు తక్కువగా ఉండడంతో చెరువు చుట్టూ పాత్‌వేపై వాకింగ్ చేసేందుకు వచ్చిన వారు ఆందోళన చెందారు. ఒక్క వర్షానికే వరద నీరు భారీగా వచ్చి చేరడంతో పరిసర ప్రాంతాలకు వరద ముప్పు తప్పడమే కాకుండా.. చెరువు నిండడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



ట్యాంక్‌బండ్‌పై వరదనీటిని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

## జులై 20 నుంచి ఢిల్లీలో బోనాలు

**సైఫాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:**

హైదరాబాద్ నగరంలోని లాల్ దర్వాజా సింహవాహని శ్రీమహకాళి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో బోనాలు దేశ రాజధాని ఢిల్లీ నగరంలోని తెలంగాణ భవన్‌లో జులై 20, 21, 22 తేదీలలో ఘనంగా నిర్వహిస్తున్నామని దేవాలయం ఛైర్మన్ జి.అరవింద్‌కుమార్‌గౌడ్ తెలిపారు. గత దశాబ్ధకాలంగా ఢిల్లీ నగరంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న ఈ బోనాలను ఈ ఏడాది కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దేవాలయం ప్రధాన కార్యదర్శి పోసాని సతీష్‌ముదిరాజ్, మాజీ ఛైర్మన్‌లు కె.వెంకటేష్, ఎ.భద్రీనాథ్‌గౌడ్‌తో కలిసి ఆయన బోనాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20వ తేదీ ఫోటో ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, 21వ తేదీన వివిధ కళా రూపాలతో వెయ్యి మంది కళాకారులు ఢిల్లీలోని ఇండియా గేట్ నుంచి తెలంగాణ భవన్ వరకు ప్రదర్శన నిర్వహిస్తారని, 22వ తేదీన అమ్మవారి ఘటాల ఊరేగింపులు, బోనాలు జాతర కొనసాగుతుందన్నారు. అలాగే ఆయన హైదరాబాద్‌లోని లాల్ దర్వాజా సింహవాహిని దేవాలయం 118వ వార్షిక బోనాల హోత్సవాల షెడ్యూల్డ్‌ను ప్రకటించారు. జులై 31వ తేదీన ధ్వజరోహణతో శిఖర పూజా కార్యక్రమాలతో మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఆగస్టు 9, 10 తేదీలలో ప్రధాన బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా కన్నుల పండువగా నిర్వహించబడతాయని, వేలాది మంది భక్తులు అమ్మవారికి బోనాలను సమర్పిస్తారని, అమ్మవారి ఊరేగింపు కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో సభ్యులు పోసాని సురేందర్‌ముదిరాజ్, ఎ.భరత్‌కుమార్, పి.సుధాకర్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అరవింద్‌కుమార్‌గౌడ్

## శాంతిభద్రతలను పరిరక్షించడమే పోలీసుల కర్తవ్యం : ఇన్‌స్పెక్టర్ కుంభం నరసింహ


ఇన్ స్పెక్టర్ కుంభం నరసింహను శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛలను అందజేస్తున్న మలక్ పేట మైత్రి కన్వీనర్ లింగాల శ్రీనివాస్ గౌడ్, లింగాల శివకుమార్ గౌడ్, కొప్పుల నాగిరెడ్డి తదితరులు

**మలక్ పేట, జూన్ 9, ప్రభాతవార్త:** శాంతిభద్రతలను పరిరక్షించడమే పోలీసుల కర్తవ్యమని మలక్ పేట ఇన్ స్పెక్టర్ కుంభం నరసింహ పేర్కొన్నారు. మలక్ పేట ఇన్ స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన కుంభం నర్సింహ ను మలక్ పేట మైత్రి కన్వీనర్ లింగాల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ కుంభం నరసింహం మాట్లాడుతూ మలక్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్టమైన పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి సమస్యలున్న వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లింగాల శివకుమార్ గౌడ్, కొప్పుల నాగిరెడ్డి, ఎం.శివకుమార్, శివ గౌడ్, పాషా, మహ్మద్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజిరెడ్డిని సన్మానించిన నాయకులు


జలమండలి యూనియన్ ఎన్నికల్లో విజయం సాధించిన రాజీ రెడ్డినీ సన్మానిస్తున్న పోల్కం శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట, జూన్ 9, ప్రభాతవార్త:** తెలంగాణ జలమండలి యూనియన్ ఎన్నికలలో విజయం సాధించిన రాజి రెడ్డి మొదటిసారిగా జలమండలి కార్యాలయానికి విచ్చేయడంతో రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ మేరు ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా రాజేందర్, రజనీకాంత్ తదితరులు శాలువాలతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛలను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు, తెలంగాణ కాంట్రాక్టర్ అసోసియేషన్ జలమండలి జేఏసీ సెక్రటరీ పోల్కంవినయ రాజ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి


ఈటెల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న లచ్చిరెడ్డి తదితరులు.

**వనస్థలిపురం. జూన్.9.ప్రభాతవార్త** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ సంక్షేమ సంఘం భవన నిర్మాణం కొరకు సహకరించాలని మరియు కాలనీ అభివృద్ధికి మరియు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులుఈటల రాజేందర్‌కి బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి వినతి పత్రం అందజేశారు.స్పందించిన ఎంపి మాట్లాడుతూ అతి త్వరలోనే కాలనీ అభివృద్ధికి మరియు సమస్యల పరిష్కారానికి కృషి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు..ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు చప్పిడి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నిట్టు కృష్ణ, ఉపాధ్యక్షులు వరప్రసాద్, కోశాధికారి సుదర్శనం, సంయుక్త కార్యదర్శి కృష్ణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ గోపి, కార్యవర్గ సభ్యులు పాండు, జయరాజు, రాజు, ఉమాశంకర్, ప్రవీణ్, మహేష్ మరియు పార్టీ సీనియర్ నాయకులు రవిశంకర్, పిట్ట శ్రీనివాస్ రెడ్డి, సుధీర్ కుమార్, చిన్న యాదవ్, దిలీప్ గౌడ్ మరియు తదితరులు ఉన్నారు.

## మంత్రి కొండా సురేఖని కలిసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజిగిరి జూన్.9.ప్రభాతవార్త** మంత్రి కొండా సురేఖని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి మల్కాజ్‌గిరి నియోజకవర్గానికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ జయగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం సమీపంలో ఇస్కాన్ టెంపుల్ – శ్రీ గౌరంగ దాం సేవా ఫౌండేషన్ (హరే రామ హరే కృష్ణ సంస్థ) ఆధ్వర్యంలో కళ్యాణ మండపం నిర్మాణం కోసం సుమారు 1500 గజాల స్థలాన్ని కేటాయించేందుకు సహకరించాలని మంత్రిని కోరారు.అదేవిధంగా మల్కాజ్‌గిరి డివిజన్ శివపురి కాలనీలో ఉన్న శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయాన్ని దేవాదాయ శాఖ పరిధి నుండి మినహాయించి చారిటబుల్ ట్రస్ట్ కింద పరిగణించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే ఓల్డ్ మల్కాజ్‌గిరిలోని శ్రీ విష్ణు దేవాలయానికి చెందిన స్థలంలో మున్నూరు కాపు భవనం నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ అంశాలపై మంత్రి కొండా సురేఖ గారు సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకునేలా అధికారులకు సూచనలు చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్, వెంకన్న, నవీన్ పాల్గొన్నారు. అలాగే ఇస్కాన్ టెంపుల్ – శ్రీ గౌరంగ దాం సేవా ఫౌండేషన్ అధ్యక్షులు వెంకటరెడ్డి, వసుధ , రాధ రెడ్డి, సతీష్‌రెడ్డి, రామిరెడ్డి, రేఖా రెడ్డి, శ్రీకాంత్ గోపీనాథ్ రాజేశ్వర్ నవీన్ రవీందర్ రామచంద్ర రెడ్డి రాజ్యలక్ష్మి, సాయిదాచా, మూర్తి రామశర్మ, మల్లికార్జున్, సుబ్రహ్మణ్యం, మోహన్‌రెడ్డి, రామకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## చెత్తను తొలగించండి..వ్యాధులను నివారించండి


లక్ష్మీ నగర్ కాలనీ రోడ్డు పక్కన చెత్త దృశ్యం

**తుర్కయంజాల్ జూన్ 9,ప్రభాతవార్త** ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ లక్ష్మీ నగర్ కాలనీ మరియు ఇంద్రమ్మ నగర్ కాలనీ మధ్యలో రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగించే విషయంలో పారిశుద్ధ్య విభాగం అధికారులు శ్రద్ధ వహించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే చెత్త చెదారం వల్ల పందులు. కుక్కల వల్ల దోమలు, ఈగలు, పందులు ఇలాంటివి కాలనీలో ఎక్కువ ఉండడం వల్ల ప్రజలు కాలనీవాసులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఆకస్మికంగా వర్షాలు కురు స్తుండడంతో ఈగలు, దోమలు, వ్యాప్తి చెందుతున్నాయని మొరుగు దుర్వాసన పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలు పందుల వల్ల, విష జ్వరాలు, స్వైన్ ఫ్లూ వంటి ప్రాణాంతక వ్యాధులు సభ ఇస్తే కాలనీవాసులు భయపడుతున్నారు. తుర్కయంజాల్ డివిజన్ లక్ష్మీ నగర్ కాలనీ, మరియు ఇంద్రమ్మ నగర్ కాలనీ రోడ్డు ప్రక్కలనే స్మశాన వాటిక రోడ్డు పక్కన చెత్త పేరుకుపోతున్న పారిశుద్ధ్య విభాగం అధికారులు సిబ్బంది పట్టించుకోవడంలే దని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీ మధ్యలో ఖాళీ స్థలం ఉన్నందువలన చెత్త వేయడంతో స్థానికంగా తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ విభాగం అధికారులు సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి ఆ ప్రాంతంలో చెత్త వేయకుండా చేయాలని ఎవరైనా చెత్త వేస్తే వారికి జరిమానా విధించాలని కూడా మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు. కాలనీల పరిధిలో 15 రోజుల కోసారి పాగింగ్ చేయాలని కాలనీవాసులు కోరారు. ఓవైపు దుర్వాసనతో అల్లాడుతుంటే మరోవైపు దోమలు. పందులు బెడతా ఎక్కువైంది కాలనీలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా పాగింగ్ చేయలేదు దీంతో దోమలు పెరిగిపోయి బయట నిలబడలేని దుస్థితి నెలకొంది అధికారులు వెంటనే స్పందించి పాగింగ్ స్ప్రే చేయించాలని కాలనీవాసులు తెలియజేశారు. లేనియెడల కలెక్టరు ఆఫీస్ ముందు ధర్నా చేస్తామని తెలియజేశారు.

## మైనంపల్లి ప్రత్యేక కృషితోనే మల్కాజిగిరికి నిధులు మంజూరు : లక్ష్మీ కాంత్ రెడ్డి


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

**మల్కాజిగిరి జూన్.9.ప్రభాతవార్త** మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రత్యేక కృషి వల్లనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మల్కాజిగిరి నియోజకవర్గం , అభివృద్ధికి సుమారు 1000 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు . మంగళవారం మల్కాజిగిరి చౌరస్తాలో లక్ష్మీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో, వందలాదిమంది మంది కార్యకర్తలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు . ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గం ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా సికింద్రాబాద్ మారేడుపల్లి వెళ్లడానికి సరైన రహదారులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు సుమారు 30 కాలనీల ప్రజలు వేలాదిమంది వాడుతున్నారు. ఏ వస్తే రహదారి రక్షణ శాఖ వారి ఆధీనంలో ఉండడంతో వాహనదారులను ప్రత్యేక సమయాన్ని ఉపయోగించాల్సి వస్తుంది. ఆర్మీ అధికారులు ఎప్పటికప్పుడు రహదారుల రాకపోకల సమయాలను మారుస్తున్నాడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక ప్రజలు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. మైనంపల్లి ప్రత్యేక దృష్టి పెట్టి ముఖ్యమంత్రి పరిష్కరించాలని కోరడం జరిగింది . ఉత్తమ్ నగర్ నుండి మారేడు పల్లి వరకు ప్రత్యేక రథాన్ని నిర్మించాలని ముఖ్యమంత్రి కోరడం జరిగింది. ఉప్పల నిర్వహించిన సీఎం బహిరంగ సభలో మల్కాజిగిరి నియోజకవర్గం ప్రత్యేక కృషితో ముఖ్యమంత్రి సుమారు 1000 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయడం జరిగింది. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లికి ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 50 సంవత్సరాలు పైగా ఉన్న మోలాలి కమాన్ శాశ్వత పరిష్కారానికి మైనంపల్లి ప్రత్యేక కృషిచేసి కమాన్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం జరిగిందన్నారు. మైనంపల్లి హయాంలోనే మల్కాజిగిరి నియోజకవర్గంలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ది బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, మీడియా కన్వీనర్ గుండా నిరంజన్, నాయకులు జెఎన్వీ సతీష్ కుమార్ ఎస్ ఆర్ ప్రసాద్ పిట్ల శ్రీనివాస్ రాందాస్ సంతోష్ రామ్ చందర్ ప్రవీణ్ సత్యమూర్తి సంపత్ గౌడ్ వినోద్ యాదవ్ సిరిగిరి రాజు పుష్పలత రామకృష్ణ పరమేష్ అశోక్ రెడ్డి పలువురు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులు అందరికీ న్యాయం చేస్తాం : మోతే శోభన్‌రెడ్డి


సదస్సులో మాట్లాడుతున్న శోభన్‌రెడ్డి చిత్రంలో కాచం సత్యనారాయణ

**ఎల్.బి.నగర్, జూన్ 9 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులందరికి న్యాయం చేస్తామని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు మోతే శోభన్‌రెడ్డి పేర్కొన్నారు చైతన్యపురిలోని శివాజీ విగ్రహం వద్ద తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమం, వికలాంగుల పాత్ర, ఆత్మగౌరవం, ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి శోభన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు న్యాయం చేయాలని కాచం సత్యనారాయణ పోరాటం చేస్తున్నారని అన్నారు. అన్ని జిల్లాలు తిరిగి కమిటీలు వేశారని తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ ఉద్యమకారులందరిని మర్చిపోయాడని, కొత్తగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇతర ఉన్నత పదవులు ఇచ్చాడన్నారు. కాచం సత్యనారాయణ కూడా ఎమ్మెల్యే పదవి వరించాల్సి ఉందని, కానీ అది వేరే వాళ్లకు ఇచ్చాడని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఉద్యమకారులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ ప్రకారం మేనిఫెస్టోలో పెట్టడం జరిగిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో వికలాంగుల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. గత వారంలో సెక్రటేరియట్‌లో అన్ని పార్టీలతో కలిసి అఖిలపక్షం ఏర్పాటు చేయడం జరిగిందన్నాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎల్బీనగర్ కీలక పాత్ర పోషించిందని, జైలుకుపోయిన వారు అమరులైన వారు ఎంతో మంది ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ కాచం సత్యనారాయణ మాట్లాడుతూ నాటి నుండి నేటి వరకు తెలంగాణ ఉద్యమంలో ఎల్బీనగర్ నియోజకవర్గం కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం సభ్యులు రంగారెడ్డి, పల్లె వినయ్‌కుమార్, కూర రమేష్, కొత్త రవి, శ్రవణ్‌కుమార్ గుప్తా, పురేందర్‌నేత, నర్సిరెడ్డి, బీరెల్లి వెంకట్‌రెడ్డి, కొండ్రు శ్రీనివాస్, వికలాంగుల సంఘం నాయకులు ఆంజనేయులు, నాగభూషణం, రాంబాబా, వేణుగౌడ్, సుధాకర్, రాజ్యలక్ష్మి, వెంకటేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 25వ తేదీ నుండి బాలాపూర్ బొడ్రాయి పునః ప్రతిష్టాపనోత్సవాలు


బాలాపూర్ బొడ్రాయి ప్రతిష్టాపనోత్సవాలకు రూ.2 లక్షల విరాళం ప్రకటించిన సామల రంగారెడ్డితో గ్రామ ముఖ్యులు

**సరూర్‌నగర్, జూన్ 9 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని అతి ముఖ్యమైన గ్రామాల్లో ప్రముఖమైన బాలాపూర్‌లో ఈ నెల 25వ తేదీ నుండి బొడ్రాయి పునః ప్రతిష్టాపనోత్సవాలు నిర్వహించనున్నారు. గ్రామ ప్రముఖులు, ముఖ్యుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీశ్రీశ్రీ శీతలా బొడ్రాయి (నాభిశిలా) ప్రతిష్టాపనోత్సవాలను ఈ నెల 25వ తేదీన శాస్త్రోక్తంగా సాంప్రదాయబద్ధంగా ప్రారంభించి 27వ తేదీన బొడ్రాయిని ప్రతిష్టించి మరునాడు 28వ తేదీ ఆదివారం బోనాలను జరపాలని నిర్ణయించారు. కోటి దీపోత్సవం పురోహితుడైన రేవల్లి రాజు శర్మ బృందం ఆధ్వర్యంలో ప్రతిష్టాపనోత్సవాలను నిర్వహిస్తారు. గ్రామ కూడలి ప్రాంతమైన పాత గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు హోమాలు తదితర కార్యక్రమాలను భారీ ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే బొడ్రాయి ప్రతిష్ట మాత్రం ప్రస్తుతం ఉన్న పాత బొడ్రాయి స్థానంలోనే జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఎన్నో దశాబ్దాల తర్వాత వస్తున్న బొడ్రాయి పండుగను గ్రామ ప్రజలు స్వాగతిస్తున్నారు. బాలాపూర్‌కు సంబంధించిన అన్ని బస్తీల ప్రజలు బొడ్రాయి పండుగను అందులో వచ్చే బోనాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని నిర్ణయించారు.

**బొడ్రాయి ఉత్సవాలకు సామల రంగారెడ్డి రూ.2 లక్షల విరాళం**

కాగా ఎన్నో సంవత్సరాల తర్వాత ప్రతిష్టాత్మకంగా జరుగనున్న బాలాపూర్ బొడ్రాయి ప్రతిష్టాపనోత్సవాలకు గ్రామ మాజీ పోలీస్ పటేల్, సరూర్‌నగర్ మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు సామల రంగారెడ్డి రూ.2 లక్షల విరాళం ప్రకటించారు. గ్రామ ముఖ్యులైన పలువురు బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో స్పందించిన సామల రంగారెడ్డి చాలా కాలం తర్వాత జరుగుతున్న బొడ్రాయి పండుగ అత్యంత వైభవంగా శాస్త్రం ప్రకారం జరగాలని ఆశిస్తూ ఉత్సవాల నిర్వహణకు తన వంతుగా రూ.2 లక్షల విరాళాన్ని ప్రకటించగా నిర్వాహకులు ఆయనకు రసీదును అందజేశారు.

## మిషన్ భగీరథ ట్యాంకు ఉన్నా మంచి నీటికి కటకట

-అధికారుల తీరును నిరసిస్తూ ట్యాంకుపైకి ఖాళీ బిందెలతో మహిళలు ఆందోళన

-స్పందించి నీటి సరఫరాకు చర్యలు తీసుకున్న అధికారులు


మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుపైకి ఎక్కి ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

**సరూర్‌నగర్, జూన్ 9 ప్రభాతవార్త:** మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు, లక్షల లీటర్ల కెపాసిటీ గల సంపు ఇళ్ళ ముందే ఉన్నా గుక్కెడు మంచి నీటి కోసం అల్లాడిన మీర్‌పేట్ లెనిన్‌నగర్ డబుల్ బెడ్ రూం నివాసులు ఖాళీ బిందెలతో వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి వినూత్న రీతిలో నిరసనకు దిగి ధర్నా చేశారు. స్థానిక మాజీ కార్పొరేటర్, బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు రాత్లావత్ నీలా రవినాయక్ ఆధ్వర్యంలో మూకుమ్మడిగా మహిళలు ఖాళీ బిందెలతో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ ఎక్కి ఆందోళన చేశారు. జిహెచ్ఎంసిలో విలీనమైన తర్వాత ప్రశాంతిహిల్స్ డివిజన్ కిందకు వచ్చిన ఈ డబుల్ బెడ్ రూం ఇళ్ళకు సంబంధించి మంచి నీటి సమస్యను తీర్చడంలో బడంగ్‌పేట్ సర్కిల్ అధికారులు, వాటర్ వర్క్స్ అధికారులు, హౌసింగ్ బోర్డు అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడం విసిగిన స్థానికులు ట్యాంకుపైకి ఎక్కి ధర్నాకు దిగడం కలకలం రేపింది. వీరి ధర్నాకు బిజెపి అధ్యక్షులు పసునూరి బిక్షపతిచారి, తులసి ముఖేష్ ముదిరాజ్, నాయకులు చవ్వ శ్రవణ్, ద్యాసాని తిరుపతిరెడ్డి, మేకుల రవీందర్‌రెడ్డి, శ్రీను నాయక్, శంకర్ నాయక్, బాలు నాయక్ తదితరులు సంఘీభావం తెలిపారు. అయితే మహిళల వినూత్న నిరసనకు దిగి వచ్చిన వాటర్ వర్క్స్ అధికారులు యుద్ధ ప్రాతిపదికను లెనిన్‌నగర్ డబుల్ బెడ్ రూం ఇళ్ళకు మంచి నీటిని సరఫరా చేయడానికి పనులు ప్రారంభించారు. రాత్రి వరకు నీటి సరఫరా చేయాలని నిర్ణయించి పనులను ముమ్మరం చేశారు. ఆందోళనలు చేస్తే గానీ అధికారులు ప్రజా సమస్యలను పరిష్కరించలేని స్థితిలో ఉన్నారని మాజీ కార్పొరేటర్, బిజెపి మహిళామోర్చా నాయకురాలు నీలా రవినాయక్ వ్యాఖ్యానించారు.

## పేదలకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలు మేలు : ఎమ్మెల్యే బలాల


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్ పేట, జూన్ 9, ప్రభాతవార్త:** పేద మహిళలకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలు ఎంతో మేలు చేకూరుస్తున్నాయని మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్ పేట్ నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అహ్మద్ బలాల అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పేద మహిళల వివాహాలకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు

## రూ.కోటి 5లక్షల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణం : రజితరెడ్డి


ఉప్పల్ అమృతకాలనీలో సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 9 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ అమృత కాలనీ అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేయించినట్లు మాజీ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ డివిజన్ అమృతకాలనీలో రూ.కోటి ఐదు లక్షలతో వ్యయంతో చేపట్టిన సిసి రోడ్ల పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మందముల రజితరెడ్డి మాట్లాడుతూ శివారు కాలనీలలోనూ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఉమ్మడి జీహెచ్ఎంసీ పరిధిలోని కాలనీలతో సమానంగా అభివృద్ధి చేయనున్నట్లుగా చెప్పారు. కాలనీలో నెలకొన్న ఇతర సమస్యల పరిష్కారానికి కూడా కావాల్సిన నిధులను మంజూరు చేయించి పనులను చేయించేలా కృషి చేస్తానని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఎర్ర ఐలేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి పసునూరి బిక్షపతి, పద్మ బిక్షపతి, కోశాధికారి రంగయ్య, సావిత్రి రంగయ్య, రాజశేఖర్, కాలనీ గౌరవ సభ్యులు నరసింహారెడ్డి, సురేంద్రబాబు, మహేందర్, రమేష్, లోకేష్, భాను ప్రసాద్, ఫిలిప్స్, గౌరవ సభ్యులు నాగరాజు, కొట్టే శ్రీనివాస్, రఘు మోహన్ రెడ్డి, సల్ల ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, కుమార్ స్వామి,మక్బూల్, సుభాష్, కృష్ణారెడ్డి, కృష్ణమూర్తి, వెంకటేష్, శ్రీనివాస్,రాఘవేందర్ పాల్గొన్నారు.

## బ్రహ్మణ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్‌తో నేతల బేటి


తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న సంఘం నేతలు

**రామంతాపూర్, జూన్ 9 ప్రభాతవార్త :** తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్‌తో మంగళవారం పలువురు బ్రాహ్మణ సంక్షేమ సంఘం నేతలు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బసవరాజు శ్రీనివాస్‌ను బోగులకుంటలోని కార్యాలయంలో కలిసి, ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సమాజ సంక్షేమం మరియు అభ్యున్నతికి పాటుపడాలని, పదవీకాలం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. సమావేశంలో సంఘం నేతలు ఒగిరాల రమేష్, రవీంద్రనాద్, గంగు నరసింహ మూర్తి, ఎన్.వి. ప్రసాద్ ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి


పవన్‌కుమార్‌ను సన్మానిస్తున్న రామారావు

**ఎల్.బి.నగర్, జూన్ 9 ప్రభాతవార్త:** సమస్యలు పరిష్కరించాలని కృషి చేస్తామని కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. మోహన్‌నగర్ ప్రజానివాస్ ఫేజ్-1లో పర్యటించిన కార్పొరేటర్ స్థానిక ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు తమ ప్రాంతంలో నెలకొన్న పలు మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలో తీవ్రమైన నీటి కొరత నెలకొన్నదని, ప్రజలు నీటికోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే బోర్‌వెల్ ఏర్పాటు చేయాలని కోరారు. డ్రైనేజీ సమస్యలు, వీధిదీపాల కొరత, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను స్థానికులు వివరించారు. అందుకు స్పందించిన పవన్ కుమార్ ఎంపీ ఈటెల రాజేందర్ సహకారంతో కాలనీలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేలా బోర్‌వెల్ ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజానివాస్ ఫేజ్-1 అసోసియేషన్ అధ్యక్షులు రామారావు, జనరల్‌సెక్రటరీ లింగేశ్వర్, శివ, సుధాకర్, రమణ, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


వంజరి ఆత్మగౌరవ భవనం (కళ్యాణ మండపం) ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తో కలిసి జ్ఞాపిక అందజేస్తున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వంజరి వినోద్ కుమార్ తదితరులు (మలక్ పేట, ప్రభాతవార్త)

## వాయిద్య కళాకారుల రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ


తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు కార్యదర్శి జె.వెంకన్న తదితరులు

**ఉప్పల్, జూన్ 9 ప్రభాతవార్త :** తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జూన్ 16న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సుపోస్టర్ మంగళవారం ఉప్పల్ సిఐటియు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి రాజు నాగరాజు మాట్లాడుతూ బ్యాండ్ కళాకారులను గత కొంతకాలంగా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు ప్యాడ్ బ్యాండ్ సీజ్ చేయడం పోలీసుల దురుసుతనం, సౌండ్ నియంత్రణ చేయకపోవడం లాంటి అంశాలతో బ్యాండ్ కళాకారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. పెళ్లిళ్ల సీజన్‌లో వాహనాలు సిజ్ చేయడంతో ఉపాధి కోల్పోయి ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. సాంస్కృతిక శాఖ బ్యాండ్ కళాకారులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని, గత 15 ఏళ్లుగా ఒక్క బ్యాండ్ కళాకారుడికి గుర్తింపు కార్డు ఇవ్వలేదన్నారు. ప్రమాదాల గురైన వారికి సహకారం చేయలేదన్నారు. ప్రభుత్వం బ్యాండ్ కళాకారులకు ఫెడరేషన్ ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ సిఐటియు జోన్ సెక్రటరీ జె వెంకన్న. బ్యాండ్ వాయిద్య కళాకారు సంఘం నేతలు హుస్సేన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సీఎం సహాయనిధి వరం


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూన్ 9 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు అండగా నిలుస్తుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన శివకుమార్(33) కిడ్నీ, పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేని సంప్రదించడంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రెండు లక్షల రూపాయల ఎల్ఓసి మంజూరు చేయించిన చెక్కును మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడం ద్వారా మాకు ఎంతో సంతృప్తి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు ఆనంతుల రాజారెడ్డి, దీప్‌లాల్‌నాయక్, ఇటికల యాదగిరి, మహ్మద్ యాసిన్, జోగు నాగేష్, బట్టు అంజయ్య, సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### దళారులను నమ్మి మోసపోవద్దు : గోపాల్ ముదిరాజ్

**సైదాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్ల విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దని చంపాపేట డివిజన్ మాధవనగర్ కాలనీ అధ్యక్షుడు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు గోపాల్ ముదిరాజ్ అన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం రెండవ విడత దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని, దరఖాస్తుల అనంతరం అధికారులు అన్ని వివరాలు పరిశీలించి అర్హులైన వారికి పత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు దక్కాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, దళారులను నమ్మి మోసపోవద్దని, ఎవరికి ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వకూడదని ఆయన సూచించారు. అర్హులందరికి తప్పకుండా న్యాయం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్లు కేటాయించబడుతాయని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

### దారి దోపిడికి పాల్పడిన నలుగురు యువకుల అరెస్ట్

**ఉప్పల్, జూన్ 9 ప్రభాతవార్త** : రామంతాపూర్‌లో దారి దోపిడికి పాల్పడిన నలుగురు యువకులను ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ లక్ష్మీనారాయణకాలనీకి చెందిన సోమ్నార్ చంద్రశేఖర్ పండ్ల వ్యాపారి ఈనెల 8వ తేదీన తెల్లవారుజామున సుమారు ఒంటి గంట సమయంలో, ఫిర్యాదుదారుడు శివకాంత్ మరియు హనుమంత్‌లతో కలిసి పెట్రోల్ పోయించుకోవడానికి లక్ష్మీనారాయణ కాలనీ నుండి రామంతాపూర్ ప్రధాన రహదారి వైపు వెళ్తుండగా, మోడ్రన్ బేకరీ సమీపంలో ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు వారిని అడ్డ గించారు. నిందితులు ముగ్గురిపై రాళ్లు మరియు చెప్పులతో దాడి చేశారు. ఈ ఘటనలో నిందితులు శివకాంత్ వద్ద ఉన్న రూ.4 వేలనగదును దోచుకుని అక్కడి నుండి పారిపోయా రైనట్లు తెలిపారు. రాయి తగలడం వల్ల తన బాధితుడి తలకు గాయమైనట్లు పోలీసులు తెలిపారు. కాగా పోలీసులు విచారణ చేసిన రామంతాపూర్ జనప్రియ అపార్ట్‌మెంట్‌లో నివసించే గుడిగుంటి శ్రేయస్ ( 23), చర్చికాలనీకి చెందిన ఆందోనీ జోనాథ (23), రాజేంద్రనగర్‌కు చెందిన పంచూబాయి భీమ్ రాజ్ ( 22 ), అదే ప్రాంతానికి చెందిన వల్లాల మణిదీప్ (24) లను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో మరో మైనర్ బాలు డు కూడా ఉన్నాడని తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అసలు విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. నిందితులు అర్ధరాత్రి వేళల్లో రోడ్లపై తిరుగుతూ, రోడ్లపై నడిచే పాదచారులను, ప్రజలను లక్ష్యంగా చేసుకునేవారని,బాధితులపై దాడి చేసి, నగదు మరియు విలువైన వస్తువులను దోచుకుని అక్కడి నుండి పారిపోయేవారని తెలిపారు.ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### రౌడీషీటర్ మిర్జా సల్మాన్ అలీ బేగ్‌కు బైండోవర్,జరిమానా

**మలక్ పేట, జూన్ 9, ప్రభాతవార్త:** చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ రౌడీ షీటర్ మిర్జా సల్మాన్ అలీ బేగ్ బౌండ్ ఓవర్ బాండ్ జప్తు కింద రూ.1 లక్ష జరిమాన విధించడం జరిగింది. చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి కథనం ప్రకారం..... హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఆదేశాల మేరకు, చార్మినార్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ కిరణ్ ఖరే మార్గదర్శకత్వంలో, మలక్‌పేట్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజా వెంకట్ రెడ్డి పర్యవేక్షణలో, ప్రజల శాంతి భద్రతల పరిరక్షణ కోసం చాదర్‌ఘాట్ పోలీసులు చేపడుతున్న నివారణాత్మక చర్యలలో భాగంగా రౌడీ షీటర్ మిర్జా సల్మాన్ అలీ బేగ్ పై గతంలో సత్ప్రవర్తన మరియు శాంతి భద్రతల నిర్వహణ కొరకు బౌండ్ ఓవర్ చర్యలు తీసుకోవడం జరిగింది. కాగా బౌండ్ ఓవర్ బాండ్ నిబంధనలను ఉల్లంఘించినందున సంబంధిత అధికారుల ఎదుట బాండ్ జప్తు ప్రక్రియ ప్రారంభించబడింది. అనంతరం చట్టపరమైన విచారణ మరియు విచారణ ప్రక్రియ పూర్తైన తరువాత బాండ్ మొత్తాన్ని చెల్లించాలని సంబంధిత అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాల మేరకు మంగళవారం రౌడీ షీటర్ మిర్జా సల్మాన్ అలీ బేగ్ బౌండ్ ఓవర్ బాండ్ జప్తు కింద రూ.1,00,000/ (ఒక లక్ష రూపాయలు మాత్రమే) చలాన్ ద్వారా ప్రభుత్వ ఖజానాకు జమ చేయడం జరిగిందని ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి తెలి యజేశారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి మాట్లా డుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ మరియు ప్రజలకు ప్రశాంతమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడమే ఇటువంటి నివారణాత్మక చర్యల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.